సాక్షి
ఖమ్మం
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024

ఖమ్మంలో రోడ్డు షోకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్



ప్రచారానికి సమన్వయ కమిటీలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అభ్యర్థి రఘురాంరెడ్డి, కూనంనేని సాంబశివరావు తదితరులు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- 4న కొత్తగూడెం సభకు సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులు పొంగులేటి, తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: పదేళ్లు రాష్ట్రాన్ని లూటీ చేసిన బీఆర్‌ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపినా.. నిస్సిగ్గుగా కేసీఆర్ బస్సుయాత్ర చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాగా, ఖమ్మం లోక్‌సభ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిచేలా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలను వేసి.. ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ప్రచారానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రంలోనే ఖమ్మం స్థానం భారీ మెజార్టీతో గెలవాలన్నది తమ లక్ష్యమని భట్టి తెలిపారు.

మార్కెట్‌లో రఘురాంరెడ్డి ప్రచారం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రచారం చేశారు. రైతులు, కార్మికులు, వ్యాపారులు, ఉద్యోగులను కలిసి తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, నల్లమోతు లక్ష్మయ్య, జొన్నలగడ్డ రవికుమార్, దీపక్ చౌదరి, ముస్తఫా, జ్యోతిర్మయి, పట్టాభి, ఎర్రా శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పెవిలియన్ గ్రౌండ్‌లో వాకర్లను కూడా రఘురాంరెడ్డి కలిశారు.

అదే భ్రమలో ఉన్నారు...

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి ఐదు నెలలు కావొస్తున్నా... ఇంకా అదే భ్రమలో ఉండి చేతిలో కర్రతో రైతులు, ఆడబిడ్డలు, యువతపై కేసీఆర్ వల్లమాలిన ప్రేమ కనబరుస్తున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన తీర్పును కొనసాగిస్తూ లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లు కట్టబెట్టాలని, ఖమ్మం అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల 4న ఉదయం 10గంటలకు కొత్తగూడెంలో జరిగే సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నందున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడగా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావీద్, దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు. తొలుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి సన్మానించారు.

నేడు కొత్తగూడెంకు యాత్ర

కేసీఆర్ సోమవారం రాత్రి ఖమ్మంలో బస చేశారు. మంగళవారం వైరా, తల్లాడ, ఏన్కూరు, జూలూరుపాడు మీదుగా కొత్తగూడెంకు బస్సుయాత్ర చేరుకుంటుంది. కొత్తగూడెంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న కేసీఆర్ రాత్రి అక్కడే బస చేయనున్నారు.

ఖమ్మం.. బ్రహ్మరథం పట్టింది

నాటి దీక్షకు ప్రజలు మద్దతు పలికారు..

- జిల్లాను సస్యశ్యామలం చేసేందుకే 'సీతారామ'
- ఇప్పుడు ఖమ్మంలో మూడురోజులకోసారి తాగునీరు
- ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజలు ఆలోచన చేయాలి
- బీఆర్‌ఎస్‌కు శక్తి, బలం ఇచ్చేలా నామను గెలిపించాలి
- బస్సుయాత్రలో గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్



మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన అభ్యర్థి నామ, మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ రవిచంద్ర తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'నాకు బాగా గుర్తుంది.. నేను ఒక్కడిని బయలుదేరిన నాడు తెలంగాణ వస్తదని ఎవరికీ నమ్మకం లేదు. నేను ఆమరణ దీక్షకు పూనుకుంటే నన్ను అరెస్ట్ చేసి ఖమ్మం జిల్లా జైలుకు తీసుకొచ్చారు. ఇక్కడ జిల్లా జైలులోనే పెడితే ఆనాడు జిల్లా బిడ్డలు, న్యూడెమోక్రసీ, కమ్యూనిస్టు విద్యార్థి బృందాలు, తెలంగాణ వాదులు బ్రహ్మరథం పట్టి ఆశీర్వదించి నాకు మద్దతు పలికారు. ఆ సంఘటన నేను మర్చిపోలేను' అని గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ దీక్షాస్మృతులను గుర్తుచేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున ప్రచారానికి కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర వరంగల్ జిల్లా నుంచి సోమవారం రాత్రి ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. దారి పొడవునా ప్రజలు ఘనస్వాగతం పలకగా, ఖమ్మం కాల్వొడ్డు నుంచి మయూరిసెంటర్, వైరారోడ్ మీదుగా జెడ్పీ సెంటర్ వరకు గంట పాటు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా జెడ్పీ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

కాంగ్రెస్ మెడలు వంచాలి..

రాష్ట్రంలో రైతులను ఎలా ఆదుకోవాలన్నది ప్రముఖ ఆగ్రో ఎకానమిస్ట్ అశోక్ గులాటీతో నెలల పాటు చర్చించి కార్యక్రమాలు తీసుకున్నాం. రైతుబంధు అందరికీ ఇచ్చాం. నీటి తీరువా రద్దు చేశాం. 7,500 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేశాం. కానీ ఇప్పుడు ఐదు ఎకరాలు ఉంటేనే రైతుబంధు ఇస్తామని కాంగ్రెస్ అంటోంది. ఆరు ఎకరాలు, ఏడు ఎకరాలు ఉన్న రైతులు కోటీశ్వరులా? 25 ఎకరాల తర్వాత ఇవ్వనంటే ఒక అర్థం. ఇదెక్కడి న్యాయం.. కాంగ్రెస్ మెడలు వంచాలి. పాత పద్ధతి లో అన్నీ జరగాలంటే బీఆర్‌ఎస్‌కు బలం ఇవ్వాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఏదో జరిగింది. ఈ ఎన్నికల్లో జిల్లా ప్రజలు ఆలోచించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలి.

ట్యాంకర్లు కొనే పరిస్థితి ఇప్పుడు

పువ్వాడ అజయ్ నాయకత్వంలో ఖమ్మంలో లకారం చెరువు, మంచినీటి వ్యవస్థ మంచిగా జరిగింది. ఖమ్మం పట్టణంలో రోజూ మంచినీళ్లు వచ్చేవి. కానీ ఇప్పుడు మూడు రోజులకోసారి మంచినీళ్లు వస్తున్నాయి. వాటర్‌ట్యాంకర్లు కొనే పరిస్థితి వచ్చింది. నాలుగు నెలల్లోనే ఇవన్నీ మాయమైపోతాయా? నేలకొండపల్లిలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు పాలేరు తూములు ఎత్తుతుంటే పక్క జిల్లాలో ఉన్న నీటి మంత్రి, ఈ జిల్లా వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేసిండ్రు.. బీఆర్‌ఎస్ హయాంలోనే ఖమ్మం, కొత్తగూడెంకు మెడికల్ కాలేజీలు ఇచ్చినం. బీజేపీ కొత్తగూడెంకు నవోదయ పాఠశాల ఇవ్వలేదు. బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదు.

కదం తొక్కిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కేసీఆర్ బస్సుయాత్ర సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. వరంగల్ జిల్లా మీదుగా బస్సుయాత్ర సాయంత్రం 6గంటల తర్వాత తిరుమలాయపాలెం మండలంలోని మాదిరిపురం వద్ద జిల్లాలోకి ప్రవేశించగా.. అక్కడి నుంచి కాల్వొడ్డు వరకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మయూరిసెంటర్‌లో మహిళలు హారతులు పట్టి గులాబీ పూలవర్షం కురిపించారు. బస్సులో నుంచే కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ జెడ్పీ సెంటర్‌కు చేరుకున్నారు. రాత్రి 8.30 గంటల నుంచి రాత్రి 8.53 వరకు ఆయన ప్రసంగం కొనసాగింది. మధిర, పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ యాత్రలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, జోగినపల్లి సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, మదన్‌లాల్, హరిప్రియ, కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, శీలంశెట్టి వీరభద్రం, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాగుపడాలని నామ ఆరాటం..

'నామ నాగేశ్వరరావుకు రాష్ట్రం బాగుపడాలని, జిల్లా బాగుపడాలనే ఆరాటం ఉంటుంది. గోదావరి నీళ్లను ఖమ్మం జిల్లాకు తెచ్చే ఆలోచన 75 ఏళ్లలో ఎవరూ చేయలే. కృష్ణాలో నీళ్లు తగ్గినప్పుడల్లా.. నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పంటలకు ఇబ్బందులు వస్తున్నాయి. ఖమ్మం జిల్లాకు శాశ్వతంగా ఇబ్బంది తీర్చాలని దుమ్ముగూడెం ప్రాంతంలో 37 టీఎంసీలతో సీతారామ ప్రాజెక్టు తీసుకున్నాం. ఇది పూర్తయితే ఖమ్మం జిల్లాలో ఇంచు భూమి కూడా ఖాళీ ఉండేది కాదు. ఇచ్చంపల్లి దగ్గర గోదావరిపై ప్రాజెక్టు కట్టి కర్ణాటక, తమిళనాడుకు నీళ్లు తీసుకుపోతానని మోదీ అంటున్నడు. రాష్ట్రంతోపాటు ఖమ్మం జిల్లాకు అన్యాయం చేసే మోదీ తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదు. నేను సీఎంగా ఉన్నప్పుడే మోదీ ఈ ప్రతిపాదన తెస్తే రాష్ట్రానికి వచ్చే నీళ్ల లెక్క తేల్చేదాక నా తల తెగినా ఒప్పుకోనని తెగేసి చెప్పా.. ఇదీ బీఆర్‌ఎస్ పార్టీ పాలసీ. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు, సీట్లు, కేంద్రమంత్రి పదవులు కావాలే తప్ప జిల్లా సమస్యలు, రైతుల ఇబ్బందులు పట్టవు.' అని కేసీఆర్ తెలిపారు.

సర్వేలన్నీ మనకే అనుకూలం..

బస్సుయాత్ర అనంతరం కేసీఆర్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ నివాసంలో బస చేయగా.. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నేతలతో సమీక్షించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సునామీ ఖాయమని, 12 ఎంపీ సీట్లు గెలవబోతున్నామని కేసీఆర్ తెలిపారు. ఖమ్మం సీటు గెలుస్తున్నామని, మిగతా పార్టీల అభ్యర్థుల కంటే నామ ముందంజలో ఉన్నట్లు సర్వే రిపోర్ట్‌లు చెబుతున్నాయని పేర్కొన్నారు. నేతలంతా కష్టపడి పని చేస్తే మంచి మెజార్టీ వస్తుందని దిశానిర్దేశం చేశారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చా..

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన తనను జిల్లా ప్రజలు ఎంపీగా గెలిపించారని బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. బస్సుయాత్రలో ఆయన మాట్లాడుతూ తనకు పార్టీ అధినేత కేసీఆర్ పార్లమెంటరీ నేతగా అవకాశం ఇచ్చారని చెప్పారు. తెలంగాణకు నీళ్లు, నిధుల కోసం పార్లమెంట్‌లో కొట్లాడానని, లోక్‌సభలో తెలంగాణ బిల్లు పెడితే తొలి ఓటు వేసింది తానేనని గుర్తుచేశారు. కేంద్రం రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయమంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు నోరు మెదపకున్నా తాము పోరాడామని తెలిపారు. తెలంగాణ గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే తనను మరో మారు ఆశీర్వదించాలని కోరారు.

న్యూస్‌రీల్

జిల్లాలో జార్ఖండ్ బృందం

'సాగు – బాగు' ప్రాజెక్టు పరిశీలన



కలెక్టర్‌తో సమావేశమైన జార్ఖండ్ బృందం

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానవన శాఖల డైరెక్టర్ కుమార్ తారాచంద్ నేతృత్వాన అక్కడి అధికారులు సాగు – బాగు ప్రాజెక్ట్ అధ్యయన నిమిత్తం సోమవారం ఖమ్మం వచ్చారు. తొలుత ఖమ్మంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. వ్యవసాయ, ఉద్యానవన రంగంలో చేపడుతున్న చర్యలు, డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యాన చేపడుతున్న సాగు – బాగు ప్రాజెక్ట్ వివరాలను వారికి కలెక్టర్ వివరించారు. అనంతరం వారు కూసుమంచి వెళ్లి రైతు వేదికలో వ్యవసాయాధికారులు, రైతులతో సమావేశమయ్యారు. ప్రాజెక్టులో భాగంగా మిర్చి సాగు చేసిన రైతులతో మాట్లాడి నాణ్యత పరిశీలన యంత్రాల పనితీరును తెలుసుకున్నారు. తమ రాష్ట్రంలో కూడా ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఉమార్ తారాచంద్, ప్రదీప్‌కుమార్ హజారీ, అభినవ్ మిశ్రా, ఖమ్మం డీఏఓ విజయనిర్మల, అధికారులు రమణ, విజయచంద్ర, డిజిటల్ గ్రీన్ ప్రాజెక్ట్ మేనేజర్లు జ్యోతి, యశోద పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠినచర్యలు

ఖమ్మంక్రైం: లోక్‌సభ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున సోషల్ మీడియాలో పోస్టులపై మీడియా మానిటరింగ్ సెల్ పర్యవేక్షణ కొనసాగుతోందని పోలీసు కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎవరైనా విద్వేషపరమైన, రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసినా, వ్యక్తిగత దూషణలకు పాల్పడినా, ఇతరులను హెచ్చరిస్తూ పోస్టులు పెట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. పార్టీలు, నాయకులను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల ద్వారా అనుచితమైన వాఖ్యలు చేస్తే కేసు నమోదుతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేస్తామని సీపీ వెల్లడించారు.

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం

- మోదీ పాలనలో విప్లవాత్మక మార్పులు
- పార్టీ అభ్యర్థులను ఆదరించండి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



అభివాదం చేస్తున్న జేపీ నడ్డా, సుధాకర్‌రెడ్డి, వినోద్‌రావు, సీతారాంనాయక్

చుంచుపల్లి : పేదలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే బీజేపీతోనే సాధ్యమని పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సోమవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని అన్నారు. దేశంలో 80 కోట్ల మంది పేదలకు ఉచిత బియ్యం, 75 ఏళ్లు నిండిన వారికి ఆయుష్మాన్ భారత్ అందిస్తున్న ఘనత తమదేనన్నారు. రాబోయే రోజుల్లో ఏడు కోట్ల కుటుంబాలకు పైపులైన్ ద్వారా వంటగ్యాస్ అందించడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్‌లో కుటుంబపాలన సాగుతోందని, దానికి అండగా నిలిచిన పార్టీలదీ అదే చరిత్ర అని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అవినీతి జరిగిందని నడ్డా ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులుగా తాండ్ర వినోద్‌రావు, సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరారు.

దేశ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు..

గత పదేళ్లలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని, దేశ ప్రజలే తన కుటుంబంగా భావించే నరేంద్ర మోదీని మరోసారి గెలిపించాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. దేశంలో కాంగ్రెస్ వచ్చేది లేదని, రాహుల్ ప్రధాని అయ్యేది లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసత్య హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఇచ్చిన చిప్ప పట్టుకొని రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, రేవంత్ ఇద్దరూ తోడు దొంగలేనని అన్నారు. కాలం చెల్లిన కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారని విమర్శించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 సీట్లనూ బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మాయమాటలు నమ్మకుండా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ ఢిల్లీలో మాదిరి ఖమ్మం కాంగ్రెస్‌లోనూ కుటుంబపాలన సాగుతోందని, స్థానికేతరుడైన వియ్యంకుడిని మంత్రి పొంగులేటి తెచ్చి పెట్టారని ఆరోపించారు. స్థానికుడినైన తననే ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మహబూబాబాద్ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ మాట్లాడుతూ తనను మరోసారి గెలిపిస్తే మహబూబాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, విజయరామారావు, ఎం.ధర్మారావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగాకిరణ్, నాయకులు శ్రీకాంత్, నంబూరి రామలింగేశ్వరరావు, జీవీకే మనోహర్, ఎం.శ్రీనివాసరెడ్డి, ఉప్పల శారద, నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, నరేంద్రబాబు పాల్గొన్నారు.

బరి ఖరారు..

- ఖమ్మం స్థానంలో పోటీకి 35 మంది అభ్యర్థులు
- ఉపసంహరించుకున్న ఆరుగురు
- అత్యధికంగా 24 మంది స్వతంత్రులు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఖమ్మం నుంచి పోటీకి మిగిలిన అభ్యర్థుల లెక్క తేలింది. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించగా 45మంది అభ్యర్థులు 72సెట్ల నామినేషన్లు సమర్పించారు. అయితే, స్క్రూటినీలో నలుగురి నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 41 మందిలో సోమగాని నరేందర్, మారం వెంకటరెడ్డి, తండు ఉపేందర్, పోట్ల నాగేశ్వరరావు, లింగం కృష్ణ, ఒడిత్యా వినోద ఉపసంహరించుకోవడంతో పోటీలో 35 మంది అభ్యర్థులు మిగిలారు. ఇందులో నలుగురు గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు కాగా, మిగతా 31 మంది రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులే. మొత్తం 35 మంది అభ్యర్థులు, నోటా కలిపి 36గుర్తులకు ఒక్కో కేంద్రంలో మూడు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు..

నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పోటీలో మిగిలిన అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. ఇందులో గుర్తింపు పొందిన పార్టీలైన బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు కారు, బీఎస్పీ అభ్యర్థి యెర్రా కామేష్‌కు ఏనుగు, కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి హస్తం, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు కమలం గుర్తు కేటాయించినట్లు తెలిపారు. ఇక రిజిస్టర్ పార్టీలైన సోషలిస్టు పార్టీ అన్వర్ రయీస్‌కు కుట్టుమిషన్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి కాశిన ఆనందప్రసాద్‌కు టెలివిజన్, బహుజన్ లెఫ్ట్ పార్టీ అభ్యర్థి ఆంథోని సురేష్‌కు కత్తెర, అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ పార్టీ అభ్యర్థి కుక్కల నాగయ్యకు చపాతీ రోలర్, జైభీంరావు భారత్ పార్టీ అభ్యర్థి కొప్పుల శ్రీనివాసరావుకు కోటు, సకల జనుల పార్టీ అభ్యర్థి పాపెట్ల రామ్మూర్తికి ఓడ, జై భారత్ నేషన్ పార్టీ అభ్యర్థి భట్టు శ్రీనివాస్‌కు టార్చ్‌లైట్ గుర్తు కేటాయించారు. మిగిలిన 24 మంది స్వతంత్ర అభ్యర్థులకు కూడా వివిధ గుర్తులు కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.

మానుకోట బరిలో 23 మంది..

మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో 30 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా ఐదుగురివి తిరస్కరణకు గురయ్యాయి. సోమవారం ఇద్దరు స్వతంత్రులు విత్‌డ్రా చేసుకోవడంతో మిగిలిన 23 మంది పోటీలో ఉన్నట్లు జాబితా వెలువరించారు.

సీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం

రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ అజయ్‌కుమార్

తిరుమలాయపాలెం: వైద్య విధాన పరిషత్ పరిధి జిల్లాలోని ఆరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)ల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని.. ఇందుకోసం ఆస్పత్రుల సూపరింటెండెంట్లు నిత్యం పర్యవేక్షించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేసిన ఆయన సత్తుపల్లి, కల్లూరు, మధిర, పెనుబల్లి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, పారామెడికల్ సిబ్బందితో సమీక్షించారు. నూతనంగా ఏర్పడిన ఆస్పత్రుల్లో సమస్యలు, కావాల్సిన సౌకర్యాలపై ఆరా తీశాక అజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ఆతర్వాత కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేశాక మెరుగుపడిన వైద్యం, ఇంకా కావాల్సిన సౌకర్యాలు తెలుసుకునేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ తొలగిపోయాక పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి మెరుగైన వైద్యసేవలందేలా కృషి చేస్తామని చెప్పారు. కాగా, ఆస్పత్రుల్లో వైద్యులు సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీఎస్ ఎంఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు జిల్లా వైద్యవిధాన పరిషత్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు సీహెచ్‌సీల సూపరింటెండెంట్లు డాక్టర్ కృపాఉషశ్రీ, మంగళ, వెంకటేశ్వర్లు, రవికుమార్, లవన్, రంజిత్, డీసీహెచ్‌ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించేలా శిక్షణ



శిక్షణపై ఆరా తీస్తున్న రమేష్

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం: ఎప్‌సెట్‌లో కేజీబీవీ విద్యార్థినులు మెరుగైన ర్యాంకులు సాధించేలా శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్షణ అదనపు సంచాలకులు జి.రమేష్ అధ్యాపకులకు సూచించారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని కేజీబీవీ లో శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. విద్యార్థినులకు మెరుగైన శిక్షణ ఇచ్చి మంచి ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దాలని తెలిపారు. అలాగే, రఘునాథపాలెం మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలుగా వేపకుంట్ల, చింతగుర్తి స్కూళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, అధికారులు రామకృష్ణ, రాజశేఖర్, భూలక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా

ఏన్కూరు: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యతండా, రాయమాదారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన వసతుల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర టీ.టీ. చాంపియన్‌గా ఖమ్మం



ట్రోఫీలతో జిల్లా క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ టోర్నీ సోమవారం సాయంత్రం ముగిసింది. ఈ టోర్నీకి ఖమ్మంతో పాటు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ, కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం నుంచి క్రీడాకారులు హాజరుకాగా, ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఖమ్మం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. బాలుర సబ్ జూనియర్ విభాగంలో ఖమ్మంకు చెందిన అనేమ్ యశ్వంత్, అనుమోలు శ్రీయన్, సంపెట బోస్, బాలికల విభాగంలో బాలసాని లక్ష్మీహరవిక, పి.వంశీ, జాలిత్, మోహిత్ విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా విజేతలకు నిర్వాహకులు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, ఓలేటి సాంబమూర్తితో పాటు రాయల్ సతీష్‌బాబు, భరణి, అష్రఫ్ హసన్, సంపెట ఉపేందర్, రామచంద్రయ్య, జంగాకార్తీక్, కొండా శ్రీధర్, డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ టోర్నీలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మంస్పోర్ట్స్: సూర్యాపేటలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్ప్రింట్స్, మిడిల్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న ఏ.గౌతమ్, మస్తాన్, మైథిలి, బిందు, మనుశ్రీ బంగారు పతకాలు, వైశాలి, కె.ఆశిష్, గోపీచంద్ రజత పతకాలు సాధించారు. వీరిని సోమవారం డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీతో అక్బర్‌అలీ అభినందించారు.

లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకట్

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయడం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌యూఐ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త ఓటర్లపై దృష్టి సారించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చిన విషయాన్ని నిరుద్యోగులకు వివరించాలని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, నాయకులు రాయల నాగేశ్వరరావు మాట్లాడగా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఉదయ్, నాయకులు సురేష్‌నాయక్, ముక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి గ్రామానికి చెందిన వేల్పుల నాగరాజు(46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన ఆదివారం ఉదయం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలనుకు వెళ్లి అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య కు పాల్పడినట్లు తెలిసింది. అదేరోజు రాత్రి కుటుంబసభ్యులు నాగరాజు మృతదేహాన్ని పెనుగొలనులోని సుబాబుల్ తోటలో గుర్తించినట్లు సమాచారం. అయితే, ఆయన మృతికి కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఎస్‌ఐ పి.సురేష్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,150	1,700
పెసలు	7,850	4,000
కందులు	10,850	10,850
మినుములు	8,600	8,500
బొబ్బెర్లు	7,900	7,850
మిర్చి	18,500	10,000
మిర్చి తాలు	9,900	8,000
పత్తి	7,200	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,174

ఇక్కడ మరింత భద్రత



ఓటర్లకు భరోసా కల్పించేలా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు (ఫైల్)

నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక కేంద్రాలు

నియోజకవర్గం	సమస్యాత్మక ప్రాంతాలు	పోలింగ్ బూత్‌లు	సూక్ష్మ పరిశీలకులు
ఖమ్మం	8	27	15
పాలేరు	20	51	31
మధిర	18	47	28
వైరా	24	40	28
సత్తుపల్లి	16	44	27
కొత్తగూడెం	14	18	15
అశ్వారావుపేట	03	03	03
మొత్తం	103	230	147

- లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక కేంద్రాల గుర్తింపు
- ఆయా ప్రాంతాల్లో సూక్ష్మపరిశీలకుల నియామకం
- పోలింగ్ కేంద్రాల లోపల, బయట సీసీ కెమెరాల ఏర్పాటు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుండగా ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఖమ్మం లోక్‌సభ పరిధిలో 1,896 పోలింగ్ బూత్‌లను 1,083 ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇందులో 103 ప్రాంతాల్లోని 230 పోలింగ్ బూత్‌ల వద్ద సమస్యాత్మక పరిస్థితులు ఉన్నాయని తేల్చారు. ఆయా ప్రాంతాల్లో పరిశీలనలకు 147మంది మైక్రో అబ్జర్వర్ల(సూక్ష్మ పరిశీలకులు)ను నియమించారు. ఇక అన్ని పోలింగ్ కేంద్రాల లోపలి భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనుండగా.. సమస్యాత్మక ప్రాంతాల్లోని బూత్‌ల్లో మాత్రం ఆవరణలో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

బతుకు పోరాటం !



ఒకరిది ఎన్నికల్లో గెలుపు కోసం ఆరాటం.. మరొకరిది బతుకుదెరువు కోసం పోరాటం అన్నట్లుగా ఉన్న ఈ దృశ్యం సోమవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో కనిపించింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ స్టేడియంలో నిర్వహించిన ప్రచార సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా పాల్గొన్నారు. ఓ పక్క సభ జరుగుతుండగా.. స్టేడియంలో మరోవైపు మహిళా కూలీ మాత్రం రోజువారీ పనిలో భాగంగా ఇసుక జల్లెడ పడుతూ కనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



ఖాజీపురంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సంజయ్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు పూర్తయ్యేలా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు సహకరించాలని ఖమ్మం లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ గేంద్రోజ్ కోల్టే సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ఆర్‌ఓ, కలెక్టర్ గౌతమ్, పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్ సింగ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణసామి, శంకరఆనంద్ మిశ్రా తో కలిసి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా పాటించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మే 3నుండి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ చేపట్టనున్నామని చెప్పారు. జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, ఉపాధికల్పన అధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్‌ను సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ గేంద్రోజ్ కోల్టే, ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో ర్యాండమైజేషన్ ద్వారా 207 మంది మైక్రో అబ్జర్వర్లకు విధులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్‌ఐసీ కోఆర్డి నేటర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడు విడతల్లో వ్యయ వివరాలు తనిఖీ

అభ్యర్థుల వ్యయం వివరాల తనిఖీకి కార్యాచరణ చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అభ్యర్థుల వ్యయ వివరాల మొదటి విడతగా మే 1న, రెండో తనిఖీ 6న, మూడో తనిఖీ 10వ తేదీన తనిఖీ చేస్తారని, ఆయా తేదీల్లో ఉదయం 10నుండి సాయంత్రం 5గంటల వరకు కలెక్టరేట్‌కు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు రిజిస్టర్లతో హాజరుకావాలని సూచించారు.

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

మధిరరూరల్: మండలంలోని ఖాజీపురం సమీపాన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను సోమవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు డాక్టర్ సంజయ్ గేంద్రోజ్ కోల్టే తనిఖీ చేశారు. ఈసందర్భంగా భద్రతకు సంబంధించి తహసీల్దార్, పోలీసులకు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల పర్యటన



బోనకల్ పీఎస్‌లో అధికారులు

బోనకల్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలీసు పరిశీలకుగా నియమితులైన ఐపీఎస్ అధికారి చరణ్‌జిత్‌సింగ్ సోమవారం బోనకల్ వచ్చారు. ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌తో కలిసి ఆయన బోనకల్ పోలీసుస్టేషన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. సమస్యాత్మక గ్రామాలు, అక్కడి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, బందోబస్తుపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి తీసుకోవద్దని ఆత్మహత్యాయత్నం

మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఘటన



ఆటోడ్రైవర్ సైదులను వారిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: టీఆర్‌ఎస్‌కేవీ ఆటో యూనియన్ నాయకులను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దంటూ ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు యత్నించాడు. టీఆర్‌ఎస్‌కేవీ ఆటో యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పాల్వంచ కృష్ణ సహా పలువురు కాంగ్రెస్‌లో చేరేందుకు సోమవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఖానాపురం యూపీహెచ్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ తోట సైదులు చేరుకుని నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ అనుబంధ ఆటో యూనియన్ సభ్యులపై కృష్ణ కేసులు పెట్టించి వేధించారంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. దీంతో అక్కడి నాయకులు ఆయనను అడ్డుకుని సర్దిచెప్పగా.. పాల్వంచ కృష్ణ పార్టీలో చేరకుండానే వెనుదిరిగాడు.

మతోన్మాద నియంతృత్వానికి గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: మే డే స్ఫూర్తితో మతోన్మాద నియంతృత్వాన్ని ఓడించి గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలో సోమవారం ఖానాపురం హవేలీ శాఖ సమావేశం సుందరయ్య భవన్‌లో సత్తెనపల్లి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఎం బరిలో ఉండగా.. మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. దేశంలో బీజేపీ మతోన్మాదం పెరిగిపోయిన నేపథ్యాన ప్రజాస్వామ్య శక్తులను గెలిపించుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉందని చెప్పారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఆ హామీని విస్మరించడమే కాక ఉన్న ఉద్యోగాలు తీసేసి నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. అంతేకాక మతాల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ఓడించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, విక్రమ్, రమ్య, మీరా, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ జంతువుల వేట.. కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

మధిర: మధిర అటవీ డివిజన్ పరిధి ఎర్రుపాలెం మండలం కాచవరానికి చెందిన వ్యక్తి వన్యప్రాణులను వేటాడుతున్నారనే సమాచారంతో అటవీ అధికారులు తనిఖీలు చేపట్టి రెండు కేజీల కణుజు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వివరాలను ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో సోమవారం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ వివరాలు వెల్లడించారు. కాచవరానికి చెందిన మార్తా శ్రీను వలలను ఉపయోగించి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అటవీ జంతువులను వేటాడినట్లు సమాచారం అందిందని తెలిపారు. దీంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా ఆయన ఇంట్లో కణుజు మాంసం లభించడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈసమావేశంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మితో సెక్షన్ ఆఫీసర్ ఎస్.కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫౌంటెన్ కాదిది!



లీకేజీతో ఎగిసిపడుతున్న నీరు

మండలంలోని బోడియాతండా వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ గేట్ వాల్వ్‌కు సోమవారం లీకేజీ ఏర్పడడంతో నీరు ఎగిసిపడింది. సుమారు 15 అడుగుల ఎత్తుతో నీరు ఎగిసిపడగా ఆ ప్రాంతమంతా జలమయమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అధికారులు నీటి సరఫరాను నిలిపివేసి లీకేజీ మరమ్మతులు చేయించారు. – కూసుమంచి

వడదెబ్బతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అస్వస్థత



కానిస్టేబుల్‌ను పరామర్శిస్తున్న సీఐ, ఎస్సైలు

ఖమ్మంక్రైం: విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఖమ్మం జెడ్పీసెంటర్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ నాగు సోమవారం విధులు నిర్వహిస్తున్నాడు. ఎండతీవ్రత కారణంగా ఆయన కళ్లు తిరిగి పడిపోవడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.కాగా, కానిస్టేబుల్ నాగును ట్రాఫిక్ సీఐ చంద్రమోహన్, ఎస్‌ఐలు రవి, సాగర్ పరామర్శించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం

రూ.9లక్షల మేర ఆస్తినష్టం



పూర్తిగా కాలిపోయిన పూరిళ్లు

పెనుబల్లి: మండలంలోని మండాలపాడు గ్రామం గొల్లగూడెంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఓ పూరింట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా.. పక్కనే ఉన్న మరో మూడు కుటుంబాలకు చెందిన పూరిళ్లు, గడ్డి వాములు కాలిపోయాయి. తొలుత గ్రామానికి చెందిన గాయం జగన్నాధం పూరింట్లో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. వడగాలులతో మంటలు ఇళ్లంతా వ్యాపించి కాలి బూడిదైంది. అంతేకాక మంటలు పక్కన ఉన్న కృష్ణయ్య చుట్టిల్లు, స్పోర్ట్స్ బైక్, సంకుల వెంకయ్యకు చెందిన ఎడ్ల కొట్టం, వరిగడ్డి వాములకు కూడా అంటుకోగా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనలో జగన్నాధం ఇంట్లోని నిత్యావసర వస్తువులు, దుస్తులు, బంగారు ఆభరణాలు, ధాన్యం అమ్మగా వచ్చిన రూ.లక్ష నగదు మంటల్లో కాలిపోయాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది. మొత్తంగా జగన్నాథంకు రూ.6 లక్షలు, గాయం కృష్ణయ్యకు సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఈమేరకు తహసీల్దార్ గంటా ప్రతాప్ రెవెన్యూ, పోలీసుల సిబ్బంది చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

వరి గడ్డివాము దగ్ధం

కామేపల్లి: కామేపల్లి పరిధి పెద్దలచ్చతండాలో రైతులు అజ్మీరా బుల్లా, అజ్మీరా సోమ్లాకు చెందిన వరిగడ్డి వాములకు సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో కాలిపోయాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగగా.. స్థానికులు అదుపు చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చినా, అప్పటికే గడ్డివాము పూర్తిగా కాలిపోగా రూ.20 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శివారు సింగరేణి క్వార్టర్స్ సమీపాన అటవీశాఖ జామాయిల్ తోట లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈమేరకు సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. రాలిన ఆకులకు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి గాయాలు

కొణిజర్ల: ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో అతి వేగంతో వచ్చిన ఓ కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి మండలానికి చెందిన ఆటో డ్రైవర్ జి.కార్తీక్‌కుమార్ కిరాయికి భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల వెళ్లి అక్కడ ఏన్కూరు వాసులు ముగ్గురితో తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో ఖమ్మం వెళ్తుండగా పల్లిపాడు స్వర్ణభారతి కోల్డ్ స్టోరేజ్ సమీపాన ఖమ్మం నుంచి సత్తుపల్లి వెళ్తున్న కారు ఆటోను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ కార్తీక్‌కుమార్, ఖమ్మంకు చెందిన సీహెచ్.నవీన్, ఏన్కూరుకు చెందిన ప్రవీణ్, సాదిక్‌కు గాయాలు కాగా 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన మిశా ల్, సంజయ్‌సింగ్‌లు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా బోమిక గ్రామానికి చెందిన భరత్ అలియానా, పద్మతుల అలియానాతో మాట్లాడి గంజాయి తీసుకొచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో వారు రూ.8లక్షల విలువైన 32కిలోల గంజాయితో విశాఖపట్నం నుంచి రైలులో ఖమ్మం వచ్చారు. ఇక్కడి నుంచి మరో రైలులో సికింద్రాబాద్ వెళ్లడానికి వేచి చూస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో వ్యవహారం బయటపడింది. ఈమేరకు గంజాయితో పాటు రూ.5వేల నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంకు చెందిన యువకుడిపై పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఆ యువకుడు ఆరు రోజుల క్రితం ఇంటి నుంచి తీసుకెళ్లాడు. బాలిక తండ్రి ఫిర్యాదుతో పోలీసులు విచారిస్తుండగా వారిద్దరు సోమవారం గ్రామానికి వచ్చారు. ఈమేరకు బాలికను పోలీసులు వైద్యపరీక్షల నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అలాగే, తొలుత యువకుడిపై నమోదు చేసిన కిడ్నాప్ కేసును పోక్సో కేసుగా మార్చినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.